# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పుణ్యస్నానం ఆచరించనున్నారు.**
2. **పేదరిక నిర్మూలనకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 'పీ4' విధానాన్ని వచ్చే నెల ఉగాది నుంచి ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **తెలంగాణాలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి.**
4. **న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణంతో చేపట్టిన రహదారుల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు.**
5. **స్వీయ ధ్రువీకరణ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ అనుమతులపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.**

==========================

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పుణ్యస్నానం ఆచరించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే మహా కుంభమేళా ప్రాంతానికి చేరుకున్నారు. ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్న నరేంద్రమోదీ.. అక్కడి నుంచి అరైల్ ఘాట్‌కు వెళ్తారు. ఉదయం 11 గంటల సమయంలో త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించి దిల్లీ బయల్దేరనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మరోవైపు జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళాకు భారత్‌తోపాటు విదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఇప్పటివరకు 38 కోట్ల మంది కుంభమేళాకు వచ్చినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది.

-------------------------

పేదరిక నిర్మూలనకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్‌షిప్-'పీ4' విధానాన్ని వచ్చే నెల ఉగాది పండుగ నుంచి ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దీనిపై సమగ్ర విధివిధానాలు రూపొందించేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తీసుకునేందుకు ప్రత్యేకంగా వెబ్ సైట్ తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. సచివాయంలో ప్రణాళిక శాఖపై నిన్న సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి.. పీ4 కార్యక్రమం ప్రారంభంపై అధికారులతో చర్చించారు.

పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలతో పాటు, ఉన్నత స్థాయిలో ఉన్నవారు పేదలకు సాయం చేసేందుకు ముందుకొస్తున్నారని, వీరందరినీ సమన్వయం చేసుకుని పీ4 విధానం అమలు చేస్తామని చెప్పారు.

---------------------------

తెలంగాణాలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నాలుగు సిఫార్సులు చేయగా వాటిలో 3 ప్రతిపాదనలకు ఆమోదం తెలపగా, ఒక సిఫార్సును తిరస్కరించింది. మంత్రిమండలి ఆమోదించిన అనంతరం సంబంధిత నివేదికను నిన్న శాసనసభ, శాసనమండలిలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో కుల గణన సర్వే-2024ను రూపొందించినట్టు తెలియజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి సమీపంలోని దివాన్ చెరువు అభయారణ్యంలో నిన్న అగ్ని ప్రమాదం జరిగింది. అటవీ ప్రాంతం మధ్య నుంచి దట్టమైన పొగ రావడంతో అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనా స్థలాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి కారణాలను అటవీ శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇది మానవతప్పిదంగా జరిగిన ప్రమాదంగా భావిస్తున్నామని తెలియజేస్తూ...

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ – ఎన్‌డీబీ రుణంతో చేపట్టిన రహదారుల విస్తరణ పనులను వర్షాకాలం మొదలయ్యేలోపు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. నిన్న ఆయన రాష్ట్ర సచివాలయంలో ఎన్‌డీబీ గుత్తేదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుత్తేదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, త్వరగా పనులు చేస్తే వెంటనే బిల్లులు చెల్లించేలా చూస్తామన్నారు.

---------------------------

నౌకా నిర్మాణం, హరిత సాంకేతికతలో యువత ప్రావీణ్యం సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలపై జపాన్‌లోని నౌకా నిర్మాణ సంస్థ ఇమబారి షిప్ బిల్డింగ్ గ్రూప్ ప్రెసిడెంట్ యుకిటో హిగాకీతో నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చర్చించినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తెలిపారు. యువతకు నైపుణ్యాలు అందించడం ద్వారా దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో నిపుణుల అవసరాలు తీర్చడానికి వీలుంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నౌకా నిర్మాణం, నౌకల నిర్వహణ యార్డులకు ఉన్న అవకాశాల పైనా చర్చించినట్లు వివరించారు.

---------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఐటీశాఖ మంత్రి నారా లోకేష్.. కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్‌తో నిన్న సమావేశమయ్యారు. రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు

తెలిపారు. ప్రాజెక్టులకు అనుమతులు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కృత్రిమ మేధ విద్యా కేంద్రాన్ని, విశాఖపట్నంలో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరారు.

---------------------------

స్వీయ ధృవీకరణ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ అనుమతులపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. సీఆర్‌డీఏ మినహా అన్ని చోట్లా అనుమతులు జారీ చేసే అధికారాన్ని నగర అభివృద్ధి ప్రాధికార సంస్థల పరిధి నుంచి పట్టణ ప్రాంత స్థానిక సంస్థలకు బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 300 చదరపు మీటర్లు మించని నిర్మాణాలకు స్వయంగా యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసేలా చట్టంలో మార్పులు చేశారు. కేవలం నివాస భవనాలకు మాత్రమే ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది.

---------------------------

ప్రయాణికుల సౌకర్యార్థం 57 రైళ్లకు తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన రైల్వేస్టేషన్లలో ప్రయోగాత్మక నిలుపుదలను పొడిగిస్తున్నట్లు రైల్వేశాఖ వెల్లడించింది. ఫిబ్రవరి నుంచి 6 నెలల పాటు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది. ఈ మేరకు ఆయా రైళ్ల వివరాలతో నిన్న ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ జాబితాలో విశాఖ ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్‌సిటీ, ఏపీ సంపర్క్ క్రాంతి సహా పలు రైళ్లు ఉన్నాయి.

భువనేశ్వర్–సికింద్రాబాద్ రైలుకు... సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ప్రయోగాత్మక నిలుపుదలను పొడిగించగా... గుంతకల్–హైదరాబాద్, జైపుర్–మైసూర్, యల్హంక–కాచిగూడ, తిరుపతి–సికింద్రాబాద్, హజ్రత్ నిజాముద్దీన్–తిరుపతి, ఎర్నాకులం–పట్నా, బీదర్–హైదరాబాద్ రైళ్లకు గద్వాల, షాద్‌నగర్, శ్రీరాంనగర్, బెల్లంపల్లి, ఖమ్మం, మంచిర్యాల, మర్పల్లి స్టేషన్లలో ఆగస్టు వరకు నిలుపుదల ఉండనుందని అధికారులు స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం కొనసాగుతుందని, కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి బి. శేఖర్ తెలుపుతూ

వాయిస్ .... 20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ చలి గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

=====================